పేదల వైద్యానికి భరోసా

- ఇందిరానగర్ ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపై హర్షం
- అందుబాటులో స్పెషలిస్ట్ వైద్యులు
- కొండవాలు ప్రజలకు డిజిటల్ వైద్యసేవలు


బర్మాక్యాంప్ ఇందిరానగర్ ఆరోగ్య కేంద్రం


ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి టీబీ సేవలు నిర్వహిస్తున్న సిబ్బంది


రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో డిజిటల్ వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చారు. రోగి వివరాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. పేదలెవరూ అనారోగ్య సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేశారు. జీవీఎంసీ 46,48 వార్డుల కొండవాలు ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఇందిరానగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఇటీవల ప్రారంభించారు. గతంలో 46,48 వార్డు ప్రజలు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న 47వ వార్డు కప్పరాడ యూపీహెచ్‌సీకి వెళ్లేవారు. ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. పేదలు, సామాన్యుల వైద్యానికి భరోసా ఇస్తూ అందుబాటులోకి వైద్య, ఆరోగ్య సేవలను తీసుకొచ్చారు. ప్రతి వార్డులో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. టీడీపీ హయాంలో ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకునే పాపాన పోలేదు. దీంతో సుదూర ప్రాంతాలకు రోగులు తరలివెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చేది. పేదలు కనీసం మందులకు నోచుకునే వారు కాదు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఆరోగ్యానికి అండగా నిలిచారు.

ప్రజలకు చేరువలో..

జీవీఎంసీ 46, 48వార్డులు కంచరపాలెం, ఊర్వశి కూడలి, కస్తూరినగర్, మధుసూధనగర్, బాపూజీనగర్, బర్మాక్యాంప్, శ్రీనివాసనగర్ ప్రాంతాల ప్రజలకు సుమారు రూ.1.32కోట్లతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మించారు. జైభారత్‌నగర్, శాంతినగర్, శివలింగపురం, సూరిబాబునగర్, సంతోష్‌నగర్, కస్తూరినగర్ తదితర ప్రాంతాల నుంచి రోజుకు వందల సంఖ్యలో రోగులు ఇక్కడకు వచ్చి వివిధ రకాల వైద్య సేవలు, మందులు ఉచితంగా పొందుతున్నారు. బర్మాక్యాంప్ ఇందిరానగర్ ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ ఓపీ సేవలతో పాటు స్పెషలిస్ట్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధారణ వైద్య సేవలు పొందవచ్చు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పెషలిస్ట్ ఓపీ సేవలు అందిస్తారు. ప్రతి రోజు ఓపీలు సుమారు 120 నుంచి 160, లాబ్ పరీక్షలు 50 నుంచి 90 వరకు చేస్తున్నారు. ప్రతిరోజు ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టంతో వైద్యసేవలు అందిస్తున్నారు.

బర్మాక్యాంప్ – ఇందిరానగర్ యూపీహెచ్‌సీ సిబ్బంది

వార్డులు –46, 48వార్డులు
సచివాలయాల పరిధి –7

మెడికల్ అధికారి	-1
స్టాఫ్ నర్స్	-2
ఫార్మసిస్ట్	-1
లాబ్ టెక్నీషియన్	-1
డేటా ఎంట్రీ ఆపరేటర్	-1
ఎల్‌జీఎస్ ఆపరేటర్	-1
ఏఎన్‌ఎంలు	-3
ఆశావర్కర్లు	-8
టీబీహెచ్‌వీ	-1

స్పెషలిస్ట్ వైద్య సేవల వివరాలు...

ప్రతి సోమవారం:	చెవి, ముక్కు, గొంతు.
ప్రతి మంగళవారం:	చర్మవ్యాధులు
ప్రతి బుధవారం:	మహిళా సంబంధిత వైద్య నిపుణులు
ప్రతి గురువారం:	జనరల్ వైద్యం.
ప్రతి శుక్రవారం:	ఎముకలు, కండరాలు.
ప్రతి శనివారం :	సాధారణ శస్త్రచికిత్స (జనరల్ సర్జన్)
ప్రతి రోజు	టీబీ వైద్యసేవలు

అందుబాటులో మెరుగైన వైద్యం



గతంలో అనారోగ్యానికి గురైతే కేజీహెచ్ వంటి పెద్దాస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. కప్పరాడ యూపీహెచ్‌సీ ఏర్పాటుతో వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉంది. సాధారణ సేవలతో పాటు స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు ఇస్తున్నారు.
– ఎస్.చిట్టితల్లి, కస్తూరినగర్, 46వ వార్డు

పైసా ఖర్చు లేకుండా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మాలాంటి రోగులకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నారు. వీటితో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటుకి తెచ్చారు. సీఎం ఆలోచన పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఒక్క పైసా ఖర్చు లేకుండా నిపుణలతో వైద్య సేవలు, ఉచితంగా మందులు అందిస్తున్నారు.
– ఆర్.కొండమ్మ, శివలింగపురం, 48వ వార్డు

కార్పొరేట్ స్థాయిలో..



ప్రజలకు కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్య సేవలు ప్రతిరోజూ అందిస్తున్నాం. జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఇప్పటికే వైద్యశిబిరాలు నిర్వహించాం. వేల సంఖ్యలో ప్రజలు వైద్య సేవలు వినియోగించుకున్నారు. పలు రకాల వైద్యానికి కార్పొరేట్ వైద్యశాలలకు రిఫర్ చేశాం. ఇక్కడి యూపీహెచ్‌సీ ఏర్పాటుతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన భారం తగ్గింది.
-సి.హరిష్మా చంద్, ప్రధాన వైద్యాధికారిణి, బర్మాక్యాంప్- ఇందిరానగర్, యూపీహెచ్‌సీ

క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం


పూజలందుకున్న శివపార్వతులు

మద్రిపాలెం: మాఘ శుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి) పురస్కరించుకుని కాశీవిశ్వేశ్వరస్వామికి అన్నపూర్ణదేవికి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ మేరకు 53వ వార్డు పంజాబ్ హోటల్ దరి సాయినగర్‌లో కొలువై ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో శిపార్వతులకు దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో,ఆలయ ధర్మకర్తలమండలి పర్యవేక్షణలో ఆలయ 33వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాన అర్చకుడు అందుకూరి శివాజీ శర్మ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈవో పీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. సాయంత్రం తిరువీధి మహోత్సవం,మంగళహారతి కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార : విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం బుధవారం ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ సీతంపేట ఫీడర్, 11 కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్లు విద్యుత్ మరమ్మతులు, చెట్టు కొమ్మలు ట్రిమ్మింగ్ నేపథ్యంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-1 ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. సీతంపేట, విజయ హాస్పటల్, జీవీకే ప్లాజా, రిలియన్స్ పెట్రోల్ బంక్, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, ఎంఆర్‌వో కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

సీతమ్మధార: ఫోర్తుటౌన్ క్రైం పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ద్విచక్రవాహనాలు దొంగతనానికి పాల్పడిన యువకుడ్ని క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదు రోజులు క్రితం రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాలలో రెండు ద్విచక్రవాహనాలు పోయినట్లు బాధితులు ఫిర్యాదు మేరకు ఫోర్తుటౌన్ క్రైం ఎస్ఐ.భాస్కరరావు దర్యాప్తు చేయగా..తాటిచెట్లపాలెంలోని పిడుగు మణికంఠ (28) నిందితుడిగా గుర్తించి మంగళవారం అరెస్ట్ చేశారు. మణికంఠ తాటిచెట్లు పాలెం, రైల్వే న్యూకాలనీ,80 అడుగుల రోడ్డు ప్రాంతాల్లో తిరుగుతూ వాహనాలను దొంగతనం చేస్తుంటాడు. నిందితుడు నుంచి రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కాపు సంక్షేమ సేన ప్రధాన కార్యదర్శిగా చలపతిరావు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు సంక్షేమ సేన అధ్యక్షులు చేగొండి హరిరామ జోగయ్య ఆదేశాలతో ఉత్తరాంధ్ర అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా రావి చలపతిరావును నియమించారు. సోషల్ మీడియా ప్రతినిధిగా సుబ్బు విశ్వనాథం, యువజ విభాగం అధ్యక్షుడిగా పడాల శేఖర్‌ను నియమించారు.

'బుల్లయ్య' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న మధుకుమార్

సీతంపేట: జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్ విశాఖపట్నం శాఖ ఎయిడ్స్ వ్యాధి అవగాహనపై జిల్లా స్థాయిలో డ్రామా పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో బుల్లయ్య కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనతో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వి.హెచ్ శ్రీకాంత్, అసిస్టెంట్ డీన్ టి.బ్రహ్మానందరెడ్డి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ దీనబంధు, ఫ్యాకల్టీ ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సత్వరం పూర్తి చేయండి


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న కేకే రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులతో పాటు జరగాల్సిన పనులపై జీవీఎంసీ అధికారులతో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పనులు వేగవంతంగా జరపాలని సూచించారు. నియోజకవర్గంలో కోట్లరూపాయలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జరగని అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత శరవేగంగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఈ భరణి, శ్రీనివాసరావు, ఏఈలు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరావు, రమణమ్మ, రత్నాకర్, సాయినాథ్, చాణక్య, సతీష్, నిహారిక, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు

సీతంపేట: నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణమండపంలో మంగళవారం జరిగిన నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయీ బ్రాహ్మణులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, డైరెక్టర్ నూకరాజు, నారాయణమ్మ, పెంటారావు, సుబ్బారావు, సీహెచ్. అప్పలరాజు, కె.వెంకటరావు, కె.గణపతి, జోనల్ అధ్యక్షులు, సెక్రటరీలు, నాయీ బ్రాహ్మణ సంఘాల పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శత సువాసినీ పూజలు


అనుగ్రహ భాషణం చేస్తున్న రమ్యానంద భారతి స్వామిని


అష్టోత్తర శత సువాసినీ పూజలు చేస్తున్న మహిళలు

సీతంపేట: అమృతోత్సవం పేరిట శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవాలు విశేష పూజా కార్యక్రమాలతో వైభవంగా జరుగుతున్నాయి. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో రెండో రోజు యాగశాలలో మండపారాధనలు, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ట, రక్షోఘ్న గణపతి హోమం, మణిద్వీప దేవతా విశేష పూజలు నిర్వహించారు. కుర్తాళం పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం పీఠం దర్బారుహాల్లో సామూహిక లలితాసహస్రనామ పారాయణ, అష్టోత్తర శత సువాసినీ పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని అనుగ్రహ భాషణం చేశారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీభూనీలా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరుగుతుందని, భక్తులు పాల్గొని తరించాలని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కోరారు.

మానసిక ఆరోగ్యం ప్రధానం


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు

ఏయూ క్యాంపస్: మానసిక ఆరోగ్యం ప్రతి వ్యక్తి జీవితంలో ఎంతో ప్రధానమైనది సైకాలజిస్ట్ మౌనికారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో మంగళవారం ప్రోగ్రాం అధికారులకు ఆదిత్య బిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఎంపవర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మానసిక ఆరోగ్య శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యక్తుల ఆలోచనలు, ఉద్రేకాలు, ప్రవర్తన, వైఖరులు, మానసిక ఆరోగ్యాన్ని సూచిస్తాయన్నారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన వల్ల ప్రజలు తమ శక్తి సామర్థ్యాలను పూర్తిగా తెలుసుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపవర్ కార్యక్రమ స్టేట్ కోఆర్డినేటర్ బి.సుధాకర రావు మాట్లాడుతూ ఒత్తిడిని తట్టుకుని మాట్లాడడం, అధిగమించే విధానాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ యువత ఎదుర్కొనే మానసిక సమస్యలకు తగిన పరిష్కారాలు చూపడం, మార్గనిర్దేశం చేయడం ఎంతో అవసరమన్నారు. అనంతరం ప్రోగ్రాం అధికారులకు ఎంపవర్ కార్యక్రమ నిర్వాహకులు శిక్షణ సామగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం విశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాధవుని కల్యాణ మహోత్సవం


లీలామాధవస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

మద్రిపాలెం: సింహాచలం ఉప దేవాలయం లీలామాధవస్వామి ఆలయంలో స్వామివారికి అత్యంత వైభవంగా కల్యాణం జరిపించారు. మాధవధార మాధవస్వామి ఆలయంలో కొలువై ఉన్న లీలామాధవస్వామి,వేణుగోపాలస్వామిలకు మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున జలధార వద్ద స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సహిత మాధవస్వామికి సింహాచలం దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రాలసాక్షిగా కల్యాణం జరిపించారు. అనంతరం మాధవధార పుర వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. కల్యాణ మహోత్సవంలో 51వ వార్డ్ కార్పొరేటర్ రెయ్యి వెంకట రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

23న ఇంద్రజాలికుల దినోత్సవం

మద్దిలపాలెం : ఈ నెల 23న ఇంద్రజాలికుల దినోత్సవాన్ని విశాఖ వ్యాలీ స్కూల్‌లో నిర్వహించనున్నట్టు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ప్రపంచ ఇంద్రజాలికుడు పద్మశ్రీ పి.సి.సర్కార్ జయంతిని పురస్కరించుకుని జరిగే ఈ వేడుకల్లో గోపాలపట్నానికి చెందిన సీనియర్ ఇంద్రజాలికుడు ఎస్.కె.అన్వర్‌బాషా ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

25న మొక్కలకు అంటు కట్టడడంపై శిక్షణ


మాట్లాడుతున్న గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం : కూరగాయలు, మొక్కలకు అంటు కట్టే ప్రక్రియపై ఈ నెల 25న సింహాచలం గోశాల ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్టు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధి దాట్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. శివాజీపాలెంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 25వ తేదీ ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు లేకుండానే ఇంటి వద్ద పంట సాగు ఎలా చేసుకోవాలనేది వివరిస్తామన్నారు. ఈ శిక్షణలో పాల్గొనేవారు తమ వివరాలను వాట్సాప్ నంబర్లు 9866138129, 9966651052లలో తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపకుడు రత్నం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విశాఖ విద్య: విద్యార్థులు చదువులతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేలా తోడ్పాటు అందిస్తామని సాంఘిక సంక్షేమ గురుకులాల ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ ఎస్. రూపవతి అన్నారు. క్రియేటివ్ ఫైన్ ఆర్ట్ అకాడమీ, రాష్ట్ర క్రియేటివిటీ కల్చర్ ఆధ్వర్యంలో గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్స్ సాధించిన శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు నాలుగు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్‌తో పాటు వివిధ కేటగిరీల్లో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆర్ట్ ఉపాధ్యాయుడు పి. సుధాకర్, ప్రిన్సిపాల్ రత్నవల్లిని ప్రత్యేకంగా అభినందించారు.

పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం


సూచనలు చేస్తున్న కేకేరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24,26,43 వార్డులకు సంబంధించి బూత్ ఏజెంట్లతో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో నిర్వహించాల్సిన విధివిధానాలను వివరించారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ 99 శాతం అమలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని..ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పతకాలు అందించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఫ్లోర్ లీడర్, మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పెద్దిశెట్టి ఉషశ్రీ, 26 వార్డు ఇన్‌చార్జ్ పీలా వెంకటలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు జీవీ రమణి, జేసీఎస్ కన్వీనర్ బగాతి విజయ్, బులుసు జగదీష్, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


నాగేశ్వరరావును సత్కరిస్తున్న రవికుమార్

సీతంపేట: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న చెల్లుబోయిన నాగేశ్వరరావును, జాతీయ,అంతర్జాతీయ క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్ ఘనంగా సత్కరించారు. అక్కయ్యపాలెంలోని సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాగేశ్వరరావు ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ ఖాళీ సమయంలో విద్యార్థులకు ట్రాయిథ్లాన్‌లో శిక్షణ ఇచ్చి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన నాగేశ్వరరావు అభినందనీయుడన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి మరిన్ని పతకాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సౌత్ ఇండియా మహిళా కన్వీనర్ రావెళ్ల కృష్ణవేణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.ఊర్వశి మహాలక్ష్మి, జోనల్ మహిళా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎం.డి.నజీరాబేగం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.పద్మ, నియోజకవర్గ నాయకులు కొల్లి రమణ, పైడిరాజు, బి.రాజేష్‌బాబు, సీహెచ్. అప్పలరాజు, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

సందడిగా వీరిబాబు పరస


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


పరసలో గరిడీల సందడి

సీతంపేట: భీష్మ ఏకాదశి సందర్భంగా అక్కయ్యపాలెం మూడుగుళ్ల వద్ద కొలువైన వరహాలక్ష్మి గణపతి ఆలయ 24వ వార్షికోత్సవం, వీరిబాబు తులసికోట పరస మహోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు బొడ్డేటి భాగ్యలక్ష్మి, బొడ్డేటి అప్పారావుల ఆధ్వర్యంలో పరస మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద లక్ష్మీగణపతి హోమం నిర్వహించి, మధ్యాహ్నం 1500 మందికి అన్నదానం చేశారు. అలాగే మహిళలకు వస్త్రదానం చేశారు. సాయంత్రం సేవ గరిడి, దుకాణాల వద్ద కొనుగోలు సందడితో పరస కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం చైర్మన్ రాజగిరి అప్పలరాజు, డిప్యూటీ చైర్మన్ మళ్ల త్రినాథ్, గౌరవాధ్యక్షుడు పాలమరశెట్టి ప్రసాద్, పిల్లా పకీర్ నాయుడు, పిల్లా గోపి, పిల్లా గణేష్, రాజగిరి వెంకట అప్పారావు, రాజగిరి పూర్ణ చంద్రరావు, కాళ్ల వెంకటరావు, పాలమరశెట్టి గోపాలకృష్ణ, బొడ్డేటి రాము పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం


క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తాయని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం పక్కన కొత్తగా అభివృద్ధి చేసిన షటిల్ కోర్టును ఆయన ప్రారంభించారు. కార్యాలయం సిబ్బంది తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంపై వీసీ సంతోషం వ్యక్తం చేశారు. వర్సిటీలో మరిన్ని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామన్నారు. విద్యతో సమానంగా విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, క్రీడా విభాగాధిపతి ఆచార్య పల్లవి, సంచాలకుడు ఆచార్య ఎస్.విజయమోహన్, డీన్ ఆచార్య జి.వీర్రాజు, ప్రిన్సిపాల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.